# సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యానికి రక్ష

● ఉద్యానశాఖాధికారి బి. ఝాన్సీ

సాలూరు రూరల్:

మండలంలోని కందులపదం, మావుడి రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖాధికారి బి.ఝాన్సీ రైతులకు మామిడి, జీడి, అరటి, పామాయిల్ పంటల నిర్వహణపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా గిరిజనులకు జీడి తోటల పెంపకంలో మెలకువలు తెలియజేశారు. అలాగే సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. కార్యక్రమంలో దశపర్ని, జిల్లేడు కషాయాల తయారీ వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి ఆవులు, గేదెలు, గొర్రెల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు రాయితీపై టార్పాలిన్లు, స్ప్రేయర్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


సీతానగరం: వరి,చెరకు పంటల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

**'పొలం పిలుస్తుంది' విజయవంతం చేయాలి**

సీతానగరం: మండలంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. రైతులు పంటల సాగుకు అవసరమైన మెలకువలపై అవగాహన కల్పించుకోవాలని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు పెదభోగిలి రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులతో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు నాయకుడు ఎస్.హరిగోపాలరావు, స్థానిక ఉప సర్పంచ్ అరవింద్‌కుమార్, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు,పశుసంవర్ధక శాఖ సిబ్బంది, సహాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**తెగుళ్లపై రైతులకు సూచనలు**

బలిజిపేట: తెగుళ్లపై రైతులు ఎటువంటి మందులు వినియోగించాలి, ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలనే దానిపై ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు తగుసూచనలు అందించారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలస, తుమరాడ గ్రా మాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా పంటపొలాలను ఆయన పరిశీలించి పాము పొడ తెగులు, సుడిదోమలను తనిఖీ చేశారు. రైతులు మూడవ దశ ఎరువులుగా పొటాష్ ఒక ఎకరాకి 20నుంచి 30కిలోల వరకు వేయాలని సూచించారు. పీడ తెగులు, దోమ ఉధృతి ఎక్కువగా ఉన్న పక్షంలో హెక్సకొనజోల్ 400 ఎంఎల్ ఎకరాకు 200లీటర్ల నీటిలో కలిపి పిచి కారీ చేయాలని సూచించారు. దోమ నివారణకు ఏసిఫేట్ 300 గ్రాములు ఎకరాకు లేదా ఇమిడాక్లోప్రిడ్ ఎకరాకు 90 నుంచి 120ఎంఎల్ పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


సాలూరు రూరల్: అరటి తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖాధికారి బి.ఝాన్సీ

## ఇది మంచి ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే


పట్టణంలోని 16వ వార్డులో ఇది మంచి ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మునిసిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యుడు బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి వాటిని వెంటనే అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

● ఏఎస్పీ సురానా అంకిత మహావీర్



పార్వతీపురం టౌన్: ఇసుక అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ సురానా అంకిత మహావీ ర్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పార్వతీపురం సబ్‌డివిజన్‌లో మాదకద్రవ్యాలు, సారా, ఇసుక అక్రమరవాణా, తదితర అసాంఘిక కార్యకలా పాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. ఎవరైనా తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్స్ అని, ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపినా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమో దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### నాణ్యంగా సీసీ కాలువ పనులు


కాలనీలో నిర్మాణం జరుగుతున్న సీసీ కాలువ పనులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో సీసీ కాలువ పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని సహాయ ఇంజినీరింగ్ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పెదభోగిలి హడ్కో కాలనీలో సర్పంచ్ జె.తేరేజమ్మ పర్యవేక్షణలో జరుగుతున్న సీసీ కాలువలను పనులను బుధవారం ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఇదివరలో గూడెం వీధిలో సీసీ రోడ్డు, కాలువ పనులు పూర్తి కావడం వల్ల కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రాధాకృష్ణ ఇంటివరకూ సీసీ కాలువ పనులతో పాటు సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ పెద్దలు అరవింద్‌కుమార్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

### గంధం చెట్టు నరికివేతకు యత్నం..


ఆలయ ప్రాంగణంలో కింద పడిన చందనం చెట్టు కొమ్మలు

భామిని: మండలంలోని బత్తిలి సంతోషి మాత ఆలయ ప్రాంగణంలో గల తెల్ల గంధం చెట్టును నరికివేసేందుకు కొంత మంది ప్రయత్నించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల కిందట చెట్టును నరికేందుకు ప్రయత్నిస్తుండగా.. కొమ్మలు భక్తుల విశ్రాంత షెడ్డుపై పడడంతో శబ్దం రావడంతో స్థానికులు లేవడంతో దొంగలు పారిపోయినట్లు సమాచారం. ఇప్పటికీ చెట్ల కొమ్మలు అక్కడే పడి ఉన్నాయి. అయినప్పటికీ ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

### వన్‌స్టాప్ కేంద్రాలలో స్థానికులనే నియమించాలి

పార్వతీపురంటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాస్పత్రి కేంద్రంగా నిర్వహించబోయే వన్‌స్టాప్ సెంటర్‌లలో నియామకాలను పార్వతీపురం జిల్లా అభ్యర్థులకే పరిమితం చేయాలని నిరుద్యోగ మహిళలు కోరారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ పీడీ కార్యాలలయంలో వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత మంజూరైన ఈ ప్రాజెక్టులో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే జిల్లాకు న్యాయం చేసినట్లు ఉంటుందని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతానికి చెందిన జిల్లా అభ్యర్థులను ఇతర జిల్లా అభ్యర్థులతో పోలిస్తే, విద్యాప్రమాణాలు, కులం విషయంలో వెనుకబాటు ఉంటుందని, దానివల్ల స్థానికులు అవకాశాలు దక్కించుకోవడంలో దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున జిల్లా అధికారులు స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వన్‌స్టాప్ సెంటర్‌లలో నియామకాలను జిల్లాలోని అభ్యర్థులకే పరిమితం చేయాలని కోరారు. ఈ విషయం ఐసీడీఎస్ పీడీ నూర్జహాన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఈ పథకం అమలవుతున్న జిల్లాల్లో స్థానికులకే ఆయా జిల్లాల అధికారులు ఇచ్చారని, ఇక్కడ కూడా జిల్లా అధికారులు స్పందించి స్థానికులకే అవకాశం ఇస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

### ఉచిత ఉపాధి శిక్షణకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: విజయనగరం జిల్లా రాజాంలోని జీఎంఆర్ నగర్‌లో గల నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(నైరెడ్)లో నిర్వహించే ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఆశక్తి ఉన్న అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, జెంట్స్ టైలరింగ్, కంప్యూటర్ టాలీ అండ్ బేసిక్స్, మహిళలకు లేడీస్ టైలరింగ్, హోం నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గంలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27న నైరెడ్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, శిక్షణ సమయంలో ఉచిత శిక్షణ, భోజన, వసతి, యూనిఫాం,టూల్ కిట్లు సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# అన్ని గ్రామాల్లో పక్కా రహదారులు

● ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పక్కా రహదారుల నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం మండలంలోని నర్సిపురం, కారాడవలస గ్రామాల్లో రూ.60 లక్షల ఉపాధి నిధులతో సీసీ రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలిజిపేట, సీతానగరం పార్వతీపురం మండలాల్లో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నామని తెలిపారు. అలాగే దశలవారీగా అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ప్రభుత్వం అన్ని పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి చంటి, గొరజాన చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు, మాజీ ఎంపీపీ గౌరీ వెంకటరమణ, జనసేన నాయకురాలు ఆగూరుమణి పాల్గొన్నారు.


రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

# డీవార్మింగ్ మాప్‌అప్ కార్యక్రమం పరిశీలన

● జిల్లావ్యాప్తంగా 3402 మందికి మాత్రల పంపిణీ
● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్.టి.జగన్మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: డీవార్మింగ్ మాప్‌అప్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్. టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘురాం బుధవారం పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మార్‌నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయడాన్ని సందర్శించారు. ఈ నెల 17న జరిగిన డీవార్మింగ్ డే కార్యక్రమంలో ఏడాది నుంచి 19 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలు, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు జిల్లా వ్యాప్తంగా వేశామని, వివిధ కారణాలతో మాత్రలు వేసుకోని వారికి మాప్‌అప్ కార్యక్రమం ద్వారా పూర్తి చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 3402 మందికి అల్బెండజోల్ మాత్రలు వేశామని, రెండు విడతల్లో 1,93,691 మందికి పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, నరసింహమూర్తి, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


డీవార్మింగ్ మాప్‌అప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్. టి.జగన్మోహన్‌రావు

# చెకుముకి ప్రశ్నపత్రాల ఆవిష్కరణ

సీతానగరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష జిల్లావ్యాప్తంగా జరిగింది. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంలోని నిడగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ సైన్స్ పశ్నపత్రాలను డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ పరీక్షల్లో 8, 9,10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆశక్తి పెరుగుతుందని, పోటీ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు.

కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎం వెంకటరమణ, హెచ్‌ఎం బి.మనోజ్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయురాలు భారతి, చూడామణి, రేవళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.


చెకుముకి ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

సాలూరు రూరల్: సాలూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి జి. పగడాలమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విధానం, మంచిమార్కులు సంపాదించే మెలకువలు వివరించారు. అలాగే పిల్లలకు మంచి నడవడిక అవసరమని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని హితవు పలికారు. అనంతరం సిబ్బందితో చర్చావేదికలో ఉపాధ్యాయులకు పలుసూచనలు సలహాలు ఇచ్చారు. పిల్లలను పరీక్షలకు సిద్ధం చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ సంబరాలు కార్యక్రమంలో చెకుముకి పరీక్షాపత్రాలు జేవీవీ ప్రతినిధి సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి పరీక్షా పత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ జి.పగడాలమ్మ

# స్వచ్ఛత హి అవగాహన ర్యాలీ



స్వచ్ఛతా హి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సాలూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులతో స్వచ్ఛతా హిపై అవగాహన కార్యక్రమాన్ని స్వచ్ఛత హి సేవ కోఆర్డినేటర్, ఐటీఐ ప్రిన్సిపాల్ కోట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐటీఐ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులతో స్వచ్ఛతా హి అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో 180 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా వినాయక నిమజ్జనం


వీధుల్లో వినాయక కమిటీ యువతను అదుపు చేసే పనిలో పోలీసులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రాజుల వీధికి చెందిన వినాయకుడిని బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మామిడిపల్లి ప్రధాన రహదారుల్లో విగ్రహాన్ని ఊరేగించి బాణసంచా కాల్చారు. అలాగే కమిటీ యువకులు డ్యాన్సులతో అలరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనాలకు ప్రత్యేక పోలీసులు**

సాలూరు పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఏటా జరిగే విధంగానే ఈ ఏడాది ఒక్కో వీధి వినాయకుడిని ఒక్కోరోజు నిమజ్జనం చేయడంతో గొడవలు తలెత్తకుండా ఉండేందుకు అదనంగా ముగ్గురు ఎస్సైౖ, 6గురు పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీ యువకులతో చర్చించి నిమజ్జన సమయంలో గొడవలకు దిగకూడదని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నిమజ్జన కార్యక్రమంలో గొడవలు సర్వసాధారణంగా ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని స్పష్టం చేశారు.

# నీరివ్వకపోవడం అన్యాయం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. ప్రజలకు తాగునీరు కూడా అందివ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉండడం అన్యాయమని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర విమర్శించారు. పట్టణ తాగునీటి సమస్య పరిష్కారం కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై. మన్మథరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణలు దీక్షల్లో కూర్చున్న వారికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ పట్టణానికి ప్రధాన సమస్య మంచినీరే నని, జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా నీటి సమస్యకు ప్రభుత్వాలు పరిష్కారం చేపట్టకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల సమస్యలను దారి మళ్లించేందుకు ప్రభుత్వాలు అనేక కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై. మన్మథరావు మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా కేంద్రం అయిన సందర్భంలో పట్టణ ప్రజల నివాస సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని ఆశించారని, కానీ ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా పెరిగిన జనాభాకు అవసరాలకు సరిపడా తాగునీరు, మౌలిక సదుపాయాలు లేక చాలా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను, చెత్త పన్ను తదితర పన్నులు వసూలు చేసే శ్రద్ధ పైప్ లైన్లు ఇవ్వడంలో ఎందుకు లేదని ప్రశ్నించారు.

**అక్టోబర్1న చలో కలెక్టరేట్**

కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారం కోసం సెప్టెంబర్ 25, 26, 27 మూడు రోజుల పాటు కలక్టరేట్ ఎదుట ఐద్వా పట్టణ శాఖ రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తుందని, ఈ దీక్షలకు పట్టణ ప్రముఖులు, మేధావులు, అభ్యుదయవాదులు సంఘీభావం తెలపాలని కోరారు. అలాగే అక్టోబర్ 1న చలో కలెక్టరేట్ చేపడుతున్నామని పట్టణ మహిళలు, పెద్దలు, మేధావులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, ఐద్వా పట్టణ కమిటీ నాయకులు జి. తులసి, ఎం.గౌరి, బి.జయ్యమ్మ, మాధురి పాడి, పి.ఉమ, రమణమ్మ, పలు వార్డుల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిస్ట్ టి. కృష్ణారావు విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం..

● ముస్తాబైన పాలకొండ దుర్గమ్మ ఆలయం
● అక్టోబర్ 3 నుంచి దసరా ఉత్సవాలు
● అధికారులతో సమావేశమైన సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి
● ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

పాలకొండ రూరల్:

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం..ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా పూజలకు సిద్ధమైంది. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సుదీర్ఘ రాజరికపు చరిత్ర గల ఈ ఆలయం 2001లో దేవదయశాఖ పరిధిలోకి వచ్చింది. తొలుత తక్కువ ఆదాయం వచ్చే ఈ ఆలయం ప్రస్తుతం ఎంతో వృద్ధి చెందింది. జిల్లాలో ఉన్న ప్రముఖ ఆదాయ వనరులున్న దేవస్థానాల్లో కోటదుర్గమ్మ దేవస్థానం ఒకటి. ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శరన్నవరాత్రి వేడుకలకు స్థానికులతో పాటు దేశ, విదేశాలల్లో ఉన్న భక్తులు కూడా వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో ఏర్పాట్ల విషయంలో సంబంధిత యంత్రాంగం మరింత అంకితభావంతో దృష్టి సారించాల్సి ఉందని భక్తులు సూచిస్తున్నారు. ప్రతిఏటా అమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

**నిజరూప దర్శనం ..**

ఏడాదిలో కొద్ది గంటల సమయం మాత్రమే అమ్మవారు నిజరూపంలో దర్శనమిస్తారు. దసరా వేడుకల్లో భాగంగా మూహూర్తపు రాట వేసే రోజున అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తారు. నిజరూప దర్శనం కోసం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుంటారు. అయితే ఈ సమయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతి ఏడాదీ తప్పడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాత్కాలిక వసతికల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే చిన్న పిల్లలతో క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు పాలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని భక్తులు కోరుతున్నారు. అమ్మవారికి సమర్పించే ఘటాలను భక్తులకు ఆలయ పరిసరాల్లో పడేస్తున్నారు.. అలాగే తలనీలాలు సమర్పించే భక్తులకు స్నానఘట్టాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. దర్శన సమయాన్ని కూడా గతంలో మాదిరిగా రాత్రి 11 గంటల వరకు పెంచాలని భక్తులు కోరుతున్నారు. వీటన్నింటిపై దేవదాయశాఖ, ఇతర అధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలి. ఇదిలా ఉంటే భక్తులు సమర్పించిన కానుకలతోనే తాత్కాలిక ఉత్సవ కమిటీ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో కమిటీ సభ్యులు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్న నేపథ్యంలో పాలకవర్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వ్యక్తమవుతోంది.




శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోటదుర్గమ్మ దేవస్థానం (ఇన్‌సెట్లో) కోటదుర్గమ్మ

**ఆదాయ వివరాలు ఇలా..**

జిల్లాలో అధిక ఆదాయం వచ్చే ఆలయాలతో పోల్చుకుంటే పాలకొండ కోటదుర్గమ్మ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో కూడా ప్రత్యేకతను చాటుకుంది. దేవదాయశాఖ అందించిన లెక్కల ప్రకారం ఏటా అమ్మ ఆదాయం పెరుగుతునే ఉంది. 2019–20లో రూ. 67.25 లక్షలు, 20–21లో రూ.46.76, 21–22లో రూ. 56.48, 22–23లో రూ.85.35, 23–24లో 90.54 లక్షల ఆదాయం సమకూరింది. దీంతోపాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.1.30 కోట్లు, 938 గ్రాముల బంగారం, బాండ్ల రూపంలో 1.620 గ్రాముల బంగారం, వెండి 49.203 కిలోలుగా ఉంది. ఏటా శరన్నవరాత్రుల సమయంలో భక్తుల నుంచి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

**ఘనంగా నిర్వహిస్తాం..**



శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించే క్రమంలో సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నారు. ఈ క్రమంలో గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. తొమ్మిది రోజులు భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దర్శనాలు కల్పిస్తాం. సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది.
– వీవీ సూర్యనారాయణ, కార్యనిర్వాహణాధికారి, కోటదుర్గమ్మ దేవస్థానం